# మప్పిసేవనం

## కొడాలి సాంబశివరావు

''ఓంనమశ్శివాయ'' వినమ్రంగా, భక్తితో శిరస్సు వంచి శివలింగానికి నమస్కరించేడు శివయ్య. అలా శివసాన్నిధ్యంలో నిలుచుంటే ఆయన ఉత్సాహం ఇనుమడిస్తుంది. పరమ శివుడు ఆయన ఇష్టదైవం - ఇలవేల్పు!


చకచకా గర్భగుడిని శుద్ధి చేసేడు. స్వామివారికి అభిషేక పూజాదులు చేయసాగేడు.

శివలింగానికి క్షీరాభిషేకం జరుగుతోంది. శిశువుకు దక్కని స్తన్యంలా పాలు శివలింగం మీన్నుంచి జారి పానవట్టం మీదుగా బయటకు ప్రవహించి పోతున్నాయ్. ఓ చెంప అభిషేకం చేస్తూనే - మరో వంక గుండెల్లో రగిలే జ్వాలను అణుచుకోసాగేడు. ఈ రోజు మనస్సు స్థిరంగా నిలబడడంలేదు. ఆయన పిచ్చిగాకపోతే ఇది దాచుకుంటే దాగే బాధనా?

నిన్న రాత్రినుంచి ఆయనింట్లో రాజెయ్యని పొయ్యి లోంచి పిల్లి లేవలేదుట! కారణాలు తోరణాలు! ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయనింట్లో అంతా ఖాళీయే! పిల్లల కడుపులు ఖాళీ - ఇల్లాలి కడుపు ఖాళీ. ఇక తన సంగతి సరేసరి. తన్ను గురించి తాను పట్టించు కోవడం మానేసి చాలా రోజులయింది. వారాలు చేసుకుంటూ వేదం చదువుకుంటున్న నాడే ఆకల్ని మర్చిపోయాడు తను.

''శివా! ప్రపంచంలోని విజ్ఞానమంతా వేదాల్లో వుంది. అన్ని వేదాలు చదువుకోడానికి అందరికీ సాధ్యపడక పోవచ్చు. నువ్వు మాత్రం ఋగ్వేదం చదువుకో, భాష్యంతో సహా పూర్తిగా చదువు'' అని తండ్రి కోరిక.

అలాగే తను వేదాధ్యయనం చేసేడు. నిండా ఇరవై అయిదు నిండక ముందే ఋగ్వేదాన్ని క్షుణ్ణంగా, భాష్య సహితంగా నేర్చుకున్నాడు. తను వేదం చదివి, వ్యాఖ్యానం చెబుతూ వుంటే తలపండిన వేదపండితులు సైతం శిరస్సులు ఆనందంగా ఊగించేవారు. 'శివయ్యా! నీ స్వరమే ఒక రస వేదం' అని రసజ్ఞులు అభినందించే వారు.



తండ్రి మరో కోరిక కూడా కోరాడు. దాంతోనే తనను బంధించాడు. 'శివా! మీ పూజారి మామయ్యకు ఒక్కతే కూతురు గౌరి. సాక్షాత్తు గౌరిలా వుంటుంది. శివాలయానికి సుక్షేత్రమైన పదెకరాల మాగాణి ఇనాం వుంది. ఆ పొలం పండించుకుంటూ, గౌరిని చేసుకుని - మన ఊరి రామలింగేశ్వరుడ్ని సేవించుకో. నువ్వు వేద పండితుడివి. సుఖభోగాలు - ఐశ్వర్యాలు ఎలాంటివో నీకూ తెలుసు. అన్నిటికీ తృప్తి ముఖ్యం - నువ్వు శాంతిగా జీవించేందుకు ఆలోచించు'' అన్జెప్పేసి తన దగ్గర వాగ్దానం తీసుకున్నాడు.

అప్పట్లో తనకంతగా లౌక్య వ్యవహారాలు తెలీవు గనుక ఆయన మాటనే చెల్లిస్తూ, శిరస్సు వంచాడు.

పాతికేళ్ల జీవితం అలా అలా సాగిపోయింది. గౌరి ఆలనలో, పాలనలో తనేనాడూ రొష్టు పడలేదు. సుఖమూ శాంతీ, ద్వంద సమాసంలా తనింట్లో తిరుగాడేయి. మల్లికార్జునుడు, వేదశిఖ, నామాక్షి ఆఖరివాడు శ్రీధరుడూ తమదాంపత్య నోము పంటగా పెరిగేరు.

ముసురుకుంటున్న ఆలోచనల్ని విదుల్చుకున్నాడాయన.

చెదిరిపోతున్న మనసుకు ఏకాగ్రత కుదుర్చుకుని శివలింగాన్ని సంప్రోక్షించేడు. నమకం - చమకం, మహాన్యాసం-దశశాంతులు, శ్రీసూక్త పురుష సూక్తములతో అభిషేకం పూర్తిచేసేడు. అనంతరం లింగానికి విభూది పూసేడు. గంధం చిలకరించేడు. మారేడు దళాల పత్రి సమర్పించాడు. '......తత్పురుష ముఖాయ, ఈశాయన ముఖాయ, ఓం నమశ్శివాయ ఏకబిల్వం శివార్పణం -'


తన మాట, మంత్రం - తన మనస్సు పుష్పం......

అందుకే తను మంత్ర పుష్పం చదివితే ఆలయ శిఖరంపై దేవతలు ఆనంద నిలయంగా కొలువుతీరేవారా అన్నంత ప్రశాంతత కనిపించేది. భక్తులు, ఆలయ ధర్మకర్తలు చెవులు రిక్కించుకుని వినేవారు.

'ధర్మకర్త...' ఆ పదం మనసులో పడగానే మళ్ళీ మనస్సు చికాకు పడింది. అప్పటి ధర్మకర్తల మండల అధ్యక్షుడు ధర్మారాయుడు నిజంగా ధర్మమూర్తే. తన జోలికి వచ్చేవారు కాదు. ఎంతయినా బహుదొడ్డగుణం. ప్రతి మాస శివరాత్రికి తగిన సంబారాలు పంపించి స్వామి వారి కల్యాణం జరిపించేవారు. కట్న కానుకలు ఇచ్చేవారు. ఆయన అభిమానమే పెద్ద కానుకగా వుండేది. ఆయన హయాంలో ప్రతి పండుగకూ ఒక ఉత్సవం ఘనంగా జరిగేది. హరికథా కాలక్షేపాలు, పురాణ పఠనాలు ఇలా ఆయన చేయని పనిలేదు. మంచితనానికి మారుపేరుగా ఎంతో భక్తితో గడిపారు. ఆరోజులే వేరు- ఆ మనుషుల తరహాయే వేరు.

ఆయన హఠాత్తుగా, శివ సాయుజ్యం పొందారు.

కొడుకు వెంకట్రాయుడు ఆనువంశికమా అన్నట్టు ధర్మకర్త అయ్యాడు. కాలం మారిపోయింది. కౌలు ఎక్కువ ముడుతుందని భూముల్ని వాళ్లే స్వాధీన పరుచుకున్నారు. ఏడాది కింత అని నెల జీతం ఏర్పాటు



చేసాడు. ఆలయ నిర్వహణకంటూ ఆ డబ్బంతా ఆయనే స్వాహా చేస్తున్నాడు.

నిత్య ధూప దీప నైవేద్యాలతో సంతృప్తిగా వున్న రామలింగేశ్వరుడు ఇంకా అలాగే వున్నాడు. మాస శివరాత్రి కల్యాణం పోయింది. నిత్య పెళ్లికొడుకు కాదేమో, మాసం మాసం పెళ్లి లేకపోతేనేం అనుకున్నాడేమో! గుళ్లో ఈశ్వరుడే కిక్కురుమన్లేదు. తనేమంటాడు? ఊళ్లో జనం ఏమంటుంది?

ఆకులు రాలినట్టు ఆనాటి తరం మనుషులు రాలి పోయారు. యువకులు పెరిగొచ్చారు. ఎక్కడికో వెళ్లి పోయిందా దైవభక్తి అన్నట్టుగా అంతా కర్మ బద్ధులు అయ్యారు. ఆలయానికి భోగాలు తగ్గాయి. భాగ్యాలు కొరవడ్డాయి.

ఎలాగో పూజ అయిందనిపించి లేచాడు శివయ్య. అష్టైశ్వర్యాలని ప్రసాదించే పరమేశ్వరుడు ఐభూదితో తృప్తిపడ్డాడు. కానీ పూజారికి ఆయనకు లేని కడుపుంది. అందులో ఆకలి వుంది. అయినా తను నిత్యం తినే తిండిలోనే దేవుడికి నిత్యనైవేద్యం అయింది. ఏనాడూ ఎవరిముందూ చేయి చాచలేదాయన. ఆశీర్వదించడమే తప్ప - యాచించడం తనకు చేతరాదు. అదేదో నీచకార్యమని మనస్సు ఎప్పుడో నమ్మింది. దేవునికి హారతి పట్టేటప్పుడు తప్ప ఎవరి ముందూ తలదించలేదు. అంతా ఆయన లీల అన్నట్టు తన పుణ్యం వలన ఇన్నిరోజులూ ఎలాగో మంచిగాను గడిచాయి. ఇకముందే... ఈ రోజుల్ని నెట్టి వేయడం ఎంత కష్టంగా వుంది?

ఇంత లేమి వెందుకుంటుందని తెలీదు. అసలు తనకు ముందుచూపులేదు. రేపటినుంచి దేవుడి నైవేద్యానికి కూడా మొహం వాచాలి... హరి దేవుడా! ఎన్ని గడ్డు సమస్యల్ని తెచ్చిపడేస్తున్నావు! ఏ జన్మ ప్రారబ్దం ఇదంతా? నీకు నైవేద్యం పెట్టడానికే అశక్తుడ్ని అయ్యేను. నా చేతులు పట్టి పోతున్నాయి. క్షమించు తండ్రీ! క్షమించు...' శివయ్య మనస్సు భారంగా, దిగులుగా మూలిగింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

** ** **

ఆ వేళ ఇల్లు మహాకాలుడి నివాసంలా వుంది.

పిల్లలంతా ఆకలి మొహాలతో పీక్కుపోయి ఆబగా చూస్తున్నారు. ఆ చూపుల్ని భరించే శక్తి శివయ్యకు లేదు. అప్పుడు భర్తను అర్థం చేసుకున్న గౌరి "ఇది మరీ బావుంది. మనం పస్తున్నా దేవుడ్ని పస్తు పెడతామా? వెళ్లి రాయుడిగారిని అడిగి రండి. మనమేమీ యాచన చేయడం లేదు. జీతం డబ్బు అడగండి. పిల్లలముఖాలు చూడండి, అటు రామలింగేశ్వరుడు - తప్పదండీ... కొన్నికొన్ని పరిస్థితుల్లో రాజీపడిపోక తప్పదు. అభిమానమనుకోకుండా - నామాట విని వెళ్లిరండి" అని పోరింది.

శివయ్య దీర్ఘంగా నిట్టూర్చి తలూపేడు.

మానాభిమానాలు మంటగలిశాయి. ఆకలికన్నా బలమైన కర్తవ్యం జయించింది. వెళ్లి అడిగేడు. ''బాబుగారూ! నా కుటుంబ స్థితి వివొద్దు. సాయం చెయ్యొద్దు. కానీ, ఈ పూటకు నైవేద్యానికి కూడా ఏం మిగల్లేదు. కనీసం దేవుడి నైవేద్యానికయినా...'' తన మాటలు పూర్తికాకముందే ''రేపురండి'' - అన్నాడాయన విసుగ్గా.

తనేమనగలడు? ఈ పూట నైవేద్యానికే లేదంటే 'రేపురా' అనేమనిషికి తనేంచెప్తాడు? ఆ దయామయుని సృష్టిలో ఇంత తేడా ఏమిటో?

శివయ్యకు మరో మాట రాలేదు. వెనుదిరిగాడు దిగులుగా.

దార్లో కేశవయ్య కన్పించి, ఆ వేళ తమ మొక్కుబడిగా దేవునికి పూజలు చేయిస్తానన్నాడు. అదేవేమో అదృష్ట మంటే! ధామలింగేశ్వరుడు నిజంగా అదృష్టవంతుడే! ముల్లోకాలను పోషించి పాలించే ఈ రుద్రుడికి ఓ పూట పస్తుండే అవస్థతప్పింది. మరి తన విషయం? ఎవరికి కావాలి?

ఆ శివుడే పట్టించుకోవాలి. ఆయన్నే నమ్ముకున్న తనకు అన్యాయం జరగదు అని విశ్వసించి ఇల్లు చేరాడు శివయ్య. తీర్థ ప్రసాదాలతో పిల్లల కడుపులు కొద్దిగా నింపగలిగాడు. భార్యా భర్తలిద్దరుమాత్రం పంచామృతం తోనే తృప్తిపడ్డారు.

'రేపు రా' అన్న ధర్మకర్త వెంకటాయుడు పట్నం వెళ్ళి నాల్గురోజులయింది. తన గోడు వినేనాథుడు లేకపోయాడు. ఆయన ఎప్పటికి దిగుతాడో...

ఈ నాల్గురోజులూ శివయ్య తెగ బాధపడిపోయాడు.

ఇంట్లో కటిక దరిద్రం - పిల్లల ఆకలి ఏడ్పులు భరించలేక అస్తమానం గుళ్లోనే గడిపేస్తున్నాడు శివయ్య. శివుని ముందు దుఃఖం వెళ్లబోసుకోవడం తప్ప మరేమీ చేయలేకపోతున్నాడు శివయ్య. దేవునికి మాత్రం భార్యేలాగో రవ్వంత నైవేద్యం సమకూర్చిపెడుతోంది. గౌరి లాంటి ఇల్లాలు గల భర్త జీవితం ధన్యం కాదా? అయినా తను ఏం సుఖపెడుతున్నాడు? ఆఖరికి కట్టుకున్న పెళ్లానికి, కడుపున పుట్టిన బిడ్డలకు ఇంత తిండి పెట్టలేక పోతున్నాడు.

ఇది అసమర్థత కాదా? ఏ దేవుడీ తప్పుని భరించాలి? ఆవేశంతో ఎగిసి పడుతున్న శివయ్య హృదయంలో భార్య వచ్చేముందు అన్న మాటలు కదిలాయి - 'ఏమండీ! పిల్లలు ఆకలికి తట్టుకోలేక పోతున్నారు. శ్రీధరుడు జ్వరంతో మగ్గుతున్నాడు. ఈ స్థితి ఇలాగే కొనసాగితే మన బిడ్డలు మనకు దక్కరు. మీ పట్టుదల, పంతం మాని ఎవర్నయినా కాస్త సాయం అడగరాదా? ధర్మకర్త ఎప్పుడొస్తాడని ఇలా రోజులు రోజులు ఎదురు చూడ్డం? ఏదో ఒకటి చేసి పిల్లలకు ఈ పూటయినా కడుపునిండా అన్న పెట్టండి......'

ఎంత వేడికోలుగా అడిగింది గౌరి. అదేనా కన్న ప్రేమా? మరి తనకు లేదా? వుంటే వారం దినాల్నుంచి పిల్లల్ని పస్తు పడుకో బెడతాడా?

ఏం చేయాలి? అక్కడకు ఇద్దరు ముగ్గుర్ని అడిగి లేదనిపించుకున్నాక - అభిమానం వచ్చి - మనసు రోషపడి - శివుడిముందుకు వచ్చి రోదించాడు. పరమ శివుడు చిద్విలాసంగా నవ్వుతున్నట్లున్నాడు.

శివయ్య మనస్సునిండా క్షీరసాగర మథనం జరుగుతోంది.

ఇదంతా భగవంతుని పరీక్ష అని సరిపెట్టుకో లేక పోతున్నాడు.

చివరకు ఓ నిర్ణయానికి వచ్చి లేచి బయటకు వచ్చి ఓసారి పరికించాడు. ఎవరూ లేరు. శివయ్య గుండెలు దడ దడ లాడేయి. పాపభీతి నిలువెల్లా వణికింపజేస్తోంది. రెండు క్షణాలు తటపటాయించేడు. 'స్వామీ! నా తప్పు మన్నించు -' అని గొణుక్కున్నాడు శివయ్య...

** ** **

''ఎక్కడివండీ... ఇన్ని పదార్థాలు?'' ఆశ్చర్యంగా, ఆనందంగా అడిగింది గౌరి.

జవాబివ్వలేదు శివయ్య. తలదించుకున్నాడు మౌనంగా.

''ఎవరిచ్చారు?''

''కొకదుకాణంలో తెచ్చా.''

''సుబ్బన్న అప్పిచ్చాడా?''

''ఆ......''

''హు... ఈనాటికి వాడే మేలయ్యాడు'' నిట్టూర్చి లోపలకెళ్లింది గౌరి.

కాలకూటం క్రమక్రమంగా గొంతు దించి గుండెల్లోకి దిగుతున్నంత బాధ...

గౌరి చకచకా వంట పూర్తి చేసింది. క్షీరాన్నం వండింది. నైవేద్యానికి కావలసినవి తను కూర్చి పెట్టింది. ''ఏమండి! త్వరగా వెళ్ళి నైవేద్యం పెట్టిరండి. పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నారు. ఈ రోజన్నా వారికింత


## యాత్ర

పుట్టుకతోనే
రెప్ప విప్పిన నేత్రం
పదును దేలిన గుండె ధైర్యాన్ని
జీర్ణించుకుంటూ,



ఉభయ సంధ్యల మధ్య
అగ్ని చక్రంలా తిరుగుతుంది.
భూత భవిష్యద్వర్తమాన
మూడు కాలాల వేళ్ల నడుమ
అనవరతం మేల్కొనే వుంటాడు కలం
సూర్యుడు

—కందుకూరి శ్రీరాములు



కడుపునిండా పెట్టుకుంటాను -" అన్నది గౌరి లరిటాకు కప్పిన నైవేద్య పళ్ళెరాన్ని అందిస్తూ.

శివయ్య మనసు రోదించింది రెండు క్షణాలు.

తరువాత గంభీరంగా అయిపోతూ "అలాగే గౌరీ, రెండు నిముషాల్లో వచ్చేస్తా -" అని పళ్ళెరం అందుకుని కదలబోయేడు.

అప్పుడు వచ్చాడు ధర్మకర్త వెంకట్రాయుడు, అతని వెంట అతని బృందం, ఆ వెనుక సుబ్బన్న...

"పూజారిగారూ! ఏమిటిది? ఇంటికి జరగలేదని హారతి పళ్లెం సుబ్బన్నకు కుదువ పెట్టి నీ ఇంటికి సంబారాలు తెచ్చుకుంటావా? వేదం చదువుకున్నావే. ఇలాంటి పాడు పనులు చేయడానికి సిగ్గులేదూ? శివుడి సొమ్ము అయాచితంగా తింటే పాడై పోతావని తెలీదూ? తరతరాల నుంచి వస్తున్న పూజారితనం నేర్పింది ఇదేనా? నిన్ను పూజారిగా తొలగిస్తున్నాం. ఆలయాన్ని గవర్నమెంట్‌లో కలిపాం. E.O. స్వాధీనమయింది నిన్ననే. భూములు వేలుకేస్తున్నారు. కొత్త పూజారిని నెల జీతం మీద ఏర్పాటు చేసాము. నిన్ను మూసి మూసి జైలుకు పంపలేక విడిచి పెడ్తున్నాం. ఇక మర్యాదగా, గౌరవంగా బ్రతకడం నేర్చుకో - " శిక్ష విధించి తీర్పు చదివి వెళ్లే న్యాయమూర్తిలా వెళ్లిపోయాడు. అతని వెంట వచ్చిన వారు 'ఛీ... ఛీ...' అని అసహ్యించుకుని వక్కా వెళ్లిపోయారు.

శివయ్య తలపైన దెబ్బతిన్న నాగులా అయ్యేడు. ఆయన కళ్లు ఎర్రగా, జ్యోతుల్లా వున్నాయి. ఒంట్లో రక్తమంతా ముఖంలోకి వచ్చి చేరినట్లయింది. గౌరి "ఏమండీ... ఇది నిజమా? -" అని నిరుత్తరురాలవుతూ అడిగింది.

శివయ్య సమాధానం ఇవ్వలేదు. నైవేద్య పళ్ళెరాన్ని అలాగే పట్టుకుని ఆలయం వేపు కదిలాడు... గౌరి పిలుస్తూ, పిల్లలు ఏడుస్తున్నా అతను పట్టించుకోలేదు. చకచకా ఆలయముందు కొచ్చి నిలుచున్నాడు.

గుడి తలుపులు మూసి వున్నాయి. కొత్తతాళం... పాత దేవుడే... కొత్త సిబ్బంది. కొత్త సేవకులు - కొత్త పూజారి...

శివయ్య ప్రళయ రుద్రుడిలా వున్నాడు. ఆ శివుని మీద పంతం తీర్చుకో బోతున్న వాడిలా వున్నాడు. అతనిలో అవమానాగ్ని తీవ్రంగా శిఖలు చిమ్ముతోంది. గుడి తలుపులు మూసి వుండడంతో ధ్వజస్తంభం ముందు పళ్లెరాన్ని దింపేడు. ఒక్క క్షణం శివుడ్ని చూశాడు - కటకటాల్లోంచి. దేవుడు ఖైదీ అయినట్లుగా వున్నాడు. శివయ్య పళ్ళెరంమీద ఆకు తొలగించి చూశాడు. అంతే... అదిరిపోయేడు. అంతే చెదిరి పోయేడు పొగలు చిమ్ముతున్న క్షీరాన్నంలో పడిన బల్లి... విషతుల్యమై పోయింది.

ఎలా జరిగిందీ పొరపాటు? ఎవరు చేసేరు ఈ పని?

ఒకరు చేస్తే జరిగేవా ఇలాంటి పనులు!

అంతా శివలీల అన్నట్లు ధ్వజస్తంభం మీది చిరు గంటలు గాలికి కదిలేయి...

శివయ్య నిప్పుల కుండలా పగిలిపోయేడు ఆవేదనలో - ఉద్వేగంతో.

'నీలకంఠా! నిన్ను పాలికేళ్ళ అర్చించాను. నిష్కల్మష మైన మనస్సుతో నిన్ను అభిషేకించి పూజించేను. చివరికీనాడు ఏమయింది?

ఒక చిన్న తప్పుకు దొంగనై పోయేను. దేవుడి సొమ్ము అయాచితంగా తస్కరించే దొంగ పూజారినై, నీ సేవకు పనికిరాకుండా పోయేను. ఇన్నాళ్లా నిన్ను నమ్మి కొలిచినందుకు నీవు చూపిన కరుణ అపారం...

వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదు. నీవు గరళ కంఠుడవు. అందుకే నిన్ను నమ్మినందుకు నా బ్రతుకులో విషం చిమ్మావు.

ఇదిగో ఈ పదార్థమంతా విషం చేసేవు, ఎందుకు నువ్వొక్కడివే ఆరగిద్దామని కదూ? ఇంత స్వార్థమా స్వామీ! నువ్వు మహా రుద్రుడివి గదా! ఈ ముష్టి నైవేద్యాన్ని నువ్వే అరిగించుకోగలవు. స్వీకరించు ప్రభూ! ఇదే నా చివరి నైవేద్యం - ఇది చివరి నివేదన ... నేను మామూలు మనిషిని, నీ పరీక్షలకు శిక్షలకు తట్టుకునే శక్తి నాకు లేదు. అది నువ్వు ఇవ్వాలి - ఇవ్వలేదు. కారణం నీకే తెలియాలి. అందుకే ఓడిపోయిన నమ్మకాలతో రాజీపడి బ్రతక లేను... నేను నీర శైవుడ్నికాను. వెర్రి శైవుడ్ని... నీ వెర్రి నాకూ కొంత అబ్బింది. అందుకే నీకు అర్పించిన ఈ ముష్టి నైవేద్యాన్ని నేనూ తింటాను. నీ ఆలయమైన స్మశానానికి పయనం కడ్తాను. చూడు ఇది కూడా ఆపగలవా?

ఓం... భూః..." అంటూ కన్నీళ్ల మధ్య నివేదించి, ప్రసాదాన్ని చేతిలోకి తీసుకున్నాడు శివయ్య.

గౌరి "ఏమండీ..." గర్జన.

శివయ్యకు అదేమీ వినిపించడంలేదు. గుళ్లో తలుపుల వెనక శివలింగంలో జ్యోతిర్మయంగా వెలుగుతున్న మహారుద్రుడు తరతర లాడిపోయాడేమో! భక్తుని చేష్టలకు భయపడుతున్నాడేమో.

గౌరి, పిల్లలు ఏడుస్తూ శివయ్యను చుట్టుముట్టారు.

అందరికీ తలాకాస్త ప్రసాదం పంచాడు. తినమన్నాడు. తనూ ప్రసాదాన్ని అందుకున్నాడు. అందరూ తినే వరకూ చూసిలా, ప్రశాంతంగా చూసేడు. ఎందుకో శివయ్య మనస్సు తేలు పడసాగింది. ఇంతకుముందున్న దుఃఖం ఇప్పుడు లేదు. ఆనందంగా - ఆరాధనగా ఒకసారి శివుడి వైపు చూస్తూ "నిన్ను తిట్టానని నన్ను శపించి నరకానికి పంపకు స్వామీ! నాకూ - నావాళ్లకూ విముక్తి నొసంగు -" అని ప్రసాదం తనూ కళ్లకద్దుకోసాగేడు...

## కవిత

నింగి జలతారులో జిగేలుమను
చుక్కలు అందకపోయినా
వాటి అందాలను తిలకిస్తూ
ఈ భూమికీ, ఆకాశానికీ మధ్య
ఊహల నిచ్చెన వేస్తే...
అది కవిత్వమే అవుతుంది
కాని...
ఈ మనసులో మెదిలే
స్నేహాన్ని యీ సృష్టిలోని
ప్రకృతి అందుకోగలిగితే
చల్లని అనుబంధం వెల్లివిరియదా
అది వెన్నెలై మనసులో నిలిచిన
బడబాగ్నిని చల్లార్చదా!
కన్నుల ముందు ఆశల వెన్నెలలు
వెలుగొందవా!

—షాజాద్ బేగం

